

# వివాహ వేడుకకు ఆహ్వానం

కాప్రా, ఏప్రిల్ 13: ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో ఆదివారం కలిసి తన కూతురు వివాహానికి ఆహ్వానించారు. ఈనెల 20వ తేదీన జరిగే తన కూతురు వివాహానికి వచ్చి ఆశీర్వదించగలరని కోరుతూ కేసీఆర్‌కు ఆయన ఆహ్వాన పత్రిక అందజేశారు.

# సర్కార్ దవాఖానల్లో కాన్పులు తగ్గాయి

సిటీబ్యూరో, ఏప్రిల్13, (నమస్తే తెలంగాణ):

- ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలంలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న శ్రీవిద్య(23) పౌష్టికాహార లోపం కారణంగా మహిళా దినోత్సవం రోజే మరణించింది. ప్రసవ సమయంలో ఆసుపత్రిలో చేరిన మహిళ.. రక్తహీనత కారణంగా తీవ్ర అనారోగ్యానికి గురైంది. సరైన పోషకాహారం తీసుకోకపోవడం మూలంగా చికిత్స పొందుతూ మరణించి, చిన్నారి శిశువును అనాథగా మిగిల్చింది. కేసీఆర్ కిట్ ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాకుండే అంటూ కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు కావడం అక్కడున్న వారందరినీ కంటతడి పెట్టించింది.
- ప్రభుత్వ ఆసుపత్రిలో సరైన వైద్యం అందక నవజాత శిశువు మృతిచెందిన ఘటన ఇటీవల వనపర్తి జిల్లాలో చోటుచేసుకుంది. అమరచింత మండలానికి చెందిన అనిత పురిటి నొప్పులతో బాధపడుతూ.. అమరచింత ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేరింది. అందులో ప్రసవం చేసేందుకు వైద్యులు లేకపోవడంతో, ఆత్మకూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పిండం వెనక భాగం బయటకు వచ్చిందని అక్కడి వైద్యులు వెనకడుగు వేసి, జిల్లా ఆసుపత్రికి తీసుకుపోండని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం కోల్పోయిన కుటుంబీకులు అక్కడే ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో తల్లిని రక్షించే క్రమంలో తల్లి కడుపులోనే ప్రాణాలు కోల్పోయిన బిడ్డ తల మొండాన్ని రెండుగా కోసి బయటికి తీశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ప్రైవేట్ ఆసుపత్రిలో చేరడం వల్ల చిన్నారి ప్రాణాలు కోల్పోయింది.

పదహారు నెలల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఎందరో శ్రీవిద్యలు ప్రాణాలు కోల్పోగా, మరెందరో అనితలు కడుపులోనే బిడ్డలను చంపుకుంటున్నరు. పేదింట్లో పుట్టిన గర్భవతులు, బాలింతలు పోషకాల లోపం కారణంగా రక్తహీనతకు గురవుతున్నారు. కేసీఆర్ పాలనలో ఇచ్చిన న్యూట్రిషన్ కిట్ కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. పేద గర్భిణులకు బాసటగా, సర్కారు దవాఖానల్లో సాధారణ ప్రసవాలే లక్ష్యంగా నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా 2017 జూన్ 2న పేట్లబుర్జ్ ఆసుపత్రి కేంద్రంగా కేసీఆర్ కిట్ పథకాన్ని స్వయంగా నాటి సీఎం కేసీఆర్ ప్రారంభించడం విశేషం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించే వారికి రూ.2000 విలువ చేసే కేసీఆర్ కిట్‌లో 16 రకాల వస్తువులతో పాటు మగపిల్లవాడు జన్మిస్తే రూ.12000, ఆడబిడ్డ జన్మిస్తే రూ.13000 గత సర్కారు చెల్లించింది. దీనివల్ల ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెరుగుతూ వచ్చింది. కేసీఆర్ కిట్ గురించి తెలుసుకున్న ఉన్నత కుటుంబాలకు చెందిన వాళ్లు సైతం ప్రభుత్వాసుపత్రుల్లోనే ప్రసవించారు. దీంతో పాటు పుట్టే బిడ్డలు, గర్భిణులు ఆరోగ్యంగా ఉండేందుకు గర్భం దాల్చిన 3 నెలలనుంచి ప్రసవం అయ్యేంత వరకు 2 పర్యాయాలు కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పేరుతో రూ.3 వేలు విలువ చేసే ఆరోగ్య వస్తువులు ఉచితంగా అందించారు. దీనికి తోడు అనేక సంక్షేమ కార్యక్రమాలు సైతం చేపట్టారు.

### ఎంసీహెచ్ కిట్ ఇవ్వడంలో కాంగ్రెస్ విఫలం

అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు.. కేసీఆర్ పేరును ప్రజల గుండెల్లోంచి తొలగించేందుకు తన కుట్రలను బయటపెట్టసాగింది. ఎంతో మందికి ఉపయోగకరంగా ఉండే పథకాల పేరు మార్చడం,లేదంటే రద్దు చేయడం వంటి దుర్మార్గపు చర్యలకు పూనుకుంది. అందులో భాగంగానే గర్భిణులు, బాలింతలకు వరమైన కేసీఆర్ కిట్, కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పేరు మార్చుతూ అధికారంలోకి రాగానే ఉత్తర్వులు జారీచేసింది. కేసీఆర్ పేరును తీసేసి ఎంసీహెచ్ కిట్‌గా ఖరారు చేసింది. పేరునైతే మార్చిందికానీ కేసీఆర్ ఆశయాన్ని అందుకోలేకపోయింది. పేరు మార్చిననాటి నుంచి నేటి వరకు ఏ ఒక్క లబ్ధిదారులకు కూడా ఎంసీహెచ్ కిట్ ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వాసుపత్రుల్లో ఎంసీహెచ్ కిట్లను 2024 ఫిబ్రవరి నుంచి కాంగ్రెస్ సర్కార్ నిలిపేసింది. ఇదిలా ఉండగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో సైతం ప్రసవాల నమోదు క్రమంగా తగ్గుతున్నది. కేసీఆర్ కిట్ ఉన్నప్పుడు నెలకు 1400 ప్రసవాలు అయిన పేట్లబుర్జ్ ఆసుపత్రిలో ప్రస్తుతం 1000 వరకు మాత్రమే అవుతున్నాయి. రాష్ట్రంలో పేరుగాంచిన నిలోఫర్ లో గతం కంటే ఇప్పుడు 500పైగా ప్రసవాలు తగ్గాయి. ప్రభుత్వ మెటర్నిటీలో 600 నుంచి 700 వరకు ప్రసవాలు తగ్గడం ఆందోళనను కలిగిస్తున్నది. గతంలో గాంధీ ఆసుపత్రికి నెలలో రిఫరల్ కేసులు, హైరిస్క్ కేసులు 400 వరకు సాధారణ ప్రసవాల కోసం 1300 వరకు వస్తుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య తగ్గడం గమనార్హం.



**కేసీఆర్ కిట్ వివరాలిలా..**

| ఆసుపత్రి పేరు | 2017 నుంచి 2024 వరకు ప్రసవాల సంఖ్య | పంపిణీ చేసిన కేసీఆర్ కిట్లు |
|---|---|---|
| కోటీ మెటర్నిటీ | 81,858 | 63,44 |
| నిలోఫర్ | 36,184 | 36,184 |
| పేట్లబుర్జు | 1,17,600 | 95000 |



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

# తెలంగాణ అభివృద్ధి ఘనత కేసీఆర్‌దే

### మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బేగంపేట్ ఏప్రిల్ 13: కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరితో అన్ని వర్గాల ప్రజలు.. ఇబ్బందులు పడుతున్నారని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులతో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో తలసాని పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి లో దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా పుట్టిన బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 27 వ తేదీన వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ సభను ఘనంగా జరుపుకుందామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటానికి పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కొలన్ లక్ష్మీ, కుర్మ హేమలత, టీమహేశ్వరి, మాజీ కార్పొరేటర్లు నామన శేషుకుమారి, అత్తిలి అరుణ గౌడ్, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఆకుల హరికృష్ణ, అత్తిలి శ్రీనివాస్ గౌడ్, కొలన్ బాల్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, వెంకటేషన్ రాజు, హన్మంతరావు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హయాంలో సర్వమతాలకు ప్రాధాన్యం

### బైశాఖీ వేడుకల్లో ఎమ్మెల్సీ కవిత

అమీర్‌పేట్, ఏప్రిల్ 13: గత బీఆర్ఎస్ ప్రభుత్వం సర్వ మతాలకు సమాన ప్రాధాన్యతను కల్పించిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. 328వ ఖల్సా పంత్ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురుద్వారా సాహెబ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరుగనున్న బైశాఖి వేడుకల్లో భాగంగా ఆదివారం అమీర్‌పేట్ మున్సిపల్ ప్లే గ్రౌండ్స్‌లో జరిగిన 'విశాల్ దివాన్'కు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వాహకులు వారిని ఘనంగా సన్మానించారు. కవిత మాట్లాడుతూ.. అర్చకులు, మౌలానాలకు అందుతున్న తరహాలోనే గిరంతీలకు కూడా పెన్షన్లు అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్యాగాలకు, దేశభక్తికి మారుపేరుగా నిలిచే సిక్కుల జీవన విధానం ఎంతో మహోన్నతమైనదన్నారు.



విశాల్ దివాన్‌లో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే తలసాని తదితరులు



### ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

కొండాపూర్, ఏప్రిల్ 13: వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పద్మశ్రీ శోభానాయుడు స్మృత్యర్థం వారి శిష్య బృందం ప్రదర్శించిన "నాట్యశోభితం" కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పీబీ కృష్ణ భారతి, బసవ లావణ్య, ఉష కిరణ్, ఉష గోటేటి, విజయ శాస్త్రి, శోభా గోపు, సంగీత రామకృష్ణ, పూర్ణిమ దాసరి, సాగరిక నాయుడు నాట్య ప్రదర్శన చేశారు. ప్రముఖ నాట్య గురువులు పద్మశ్రీ పద్మజారెడ్డి, డాక్టర్ రమాదేవిలు విచ్చేసి కళాకారులను అభినందించారు.



కేబీఆర్ పార్కు వద్ద ఆటిజం అవగాహన ర్యాలీలో పాల్గొన్న దివీస్ ఉద్యోగులు, యువత

# చికిత్సతో ఆటిజంను అధిగమించవచ్చు

### దివీస్ ఎండీ డాక్టర్ మురళీ కే. దివీ

బంజారాహిల్స్, ఏప్రిల్ 13: ఆటిజం (బుద్ధిమాంద్యం) వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దివీస్ ఎండీ డాక్టర్ మురళీ కే. దివీ తెలిపారు. సరైన సమయంలో ఆటిజాన్ని గుర్తించడం, చికిత్స అందిస్తే దీనిని సులువుగా అధిగమించవచ్చనే అంశంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు దివీస్ ఫౌండేషన్ ఫర్ గిఫ్టెడ్ చిల్డ్రన్, ఫెర్నాండేజ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు వద్ద అవగాహన వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా దివీస్ ఎండీ డాక్టర్ మురళీ కే. దివీ మాట్లాడుతూ...ఆటిజంతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి వారిని సాధారణ పిల్లల మాదిరిగా మార్చేందుకు తాము పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఏప్రిల్ నెలను ఆటిజం అవగాహన మాసంగా జరుపుకుంటున్నారని అన్నారు . ఈ కార్యక్రమంలో దివీస్ డైరెక్టర్ నీలిమా దివీ, ఫెర్నాండేజ్ డాక్టర్ ప్రమోద్, దివీస్ ఉపాధ్యక్షులు ప్రకాశ్ దివీ, మధు బాబు, జీఎంలు సుబ్బారావు, బి. వరప్రసాద్, జె.మనోరంజన్ తదితరులు పాల్గొన్నారు.



### గచ్చిబౌలిలో ఆటిజం సమగ్రతవాక్

శేరిలింగంపల్లి, ఏప్రిల్ 13: గచ్చిబౌలి స్టేడియంలో మర్హం – రెసొనేటింగ్ రెసిలియన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వాక్ ఏ వేవ్ (ఆటిజం వాక్) కార్యక్రమం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. 3వేల మందికి పైగా ఔత్సాహికులు స్వచ్ఛందంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి నటి పాయల్ రాధాకృష్ణ, పద్మశ్రీ డాక్టర్ మంజుల అనగాని, టీఎస్ఎంసీ అధ్యక్షురాలు డాక్టర్ ప్రతిభ, డాక్టర్ మిన్హాజ్, డాక్టర్ లోకేశ్, ఆర్జే షదాబ్ హాజరయ్యారు. మర్హం వ్యవస్థాపకులు డాక్టర్ నవత్ లఖాని మాట్లాడుతూ.. "ఎదుగుతున్న పిల్లలకు స్నేహితులు, కుటుంబం మద్దతు ఉంటుందనే భరోసాతో తల్లిదండ్రులు ఉంటారని కానీ ఆటిజం ఉన్న పిల్లల తల్లిదండ్రులకు ఆ భరోసా సులభంగా లభించదని అన్నారు. అలాంటి పిల్లలకు భరోసాగా సమాజం ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు.



సికింద్రాబాద్ క్లాక్ టవర్ ప్రాంతం లోని వెస్లీ చర్చి లో పామ్ సండే (మట్టల ఆదివారం) ఘనంగా నిర్వహించారు . ఇది క్రైస్తవులకు అత్యంత పవిత్రమైన ఆదివారాల్లో ఒకటి. ఈ రోజు, యేసు క్రీస్తు జెరూసలంలోకి ప్రవేశించినప్పుడు ఆయనను ప్రజలు మట్టపు కొమ్మలతో మరియు వస్త్రాలతో స్వాగతం పలికిన రోజుగా గుర్తుంచుకుంటారు. ఈ రోజును జరుపుకోవడం ద్వారా యేసు క్రీస్తును రాజుగా, రక్షకునిగా గుర్తించుకుంటారు. అలాగే క్రైస్తవులు ఈ వారానికి పవిత్ర వారానికి ప్రారంభంగా కూడా పాటిస్తారు.

# వ్యవసాయ రంగంలోనూ ఏఐ వినియోగం

### గురుకాశి యూనివర్సిటీ డైరెక్టర్ డాక్టర్ అశోక్ సేథీ

బంజారాహిల్స్, ఏప్రిల్ 13: వ్యవసాయ రంగంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) వినియోగంతో మెరుగైన ఫలితాలు రాబట్టే అవకాశం ఉందని పంజాబ్‌లోని గురుకాశి విశ్వ విద్యాలయం డైరెక్టర్ డాక్టర్ అశోక్ సేథీ అన్నారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. మారిన కాలంతో పాటు అన్ని రంగాల్లో కొత్త విధానాలు వచ్చాయని, వ్యవసాయ రంగంలో సైతం ఏఐ వినియోగం త్వరలో అందుబాటులోకి రానుందన్నారు.

### ఏఐ ఆధారిత అగ్రికల్చర్, బీటెక్ కోర్సులు

దీన్ని దృష్టిలో పెట్టుకుని గురుకాశీ విశ్వవిద్యాలయంలో ఏఐ ఆధారంగా అగ్రికల్చర్ బీఎస్సీతో పాటు బీటెక్ కోర్సులు అందిస్తున్నామని వెల్లడించారు. ఏ సమయంలో విత్తనాలు వేయాలి.. ఎంత మోతాదులో ఎరువులు వేయాలి.. చీడ పురుగులు వస్తే పురుగుల మందులు ఎప్పుడు పిచికారీ చేయాలనే అంశాలపై రైతులకు ఏఐ ద్వారా అవగాహన కల్పిస్తే అధిక దిగుబడి సాధించొచ్చని ఆయన అన్నారు. ఎప్పుడు వర్షాలు పడే అవకాశం ఉంది.. వేడిశాతం ఎంత ఉందని.. దానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా ఏఐ ఆధారంగా గుర్తించొచ్చన్నారు. పంట ఎదిగే విధానాన్ని ఏఐ ద్వారా గుర్తించొచ్చనీ, పురుగు మందుల వినియోగం తదితర అంశాలన్నీ ఏఐ ఆధారిత అగ్రికల్చర్ కోర్సుల్లో తాము అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మ్యాస్ట్రో డైనమిక్ సీఈఓ భావన్ రెడ్డి, సింధుజ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న అశ్విని సేథీ



కార్యక్రమంలో నటీమనులతో కలిసి హాజరైన మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ

# విద్యను ప్రతిఒక్కరికీ చేరువ చేయాలి

### ఐటీ మంత్రి శ్రీధర్ బాబు

మాదాపూర్, ఏప్రిల్ 13: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉన్నత లక్ష్యంతో టీచ్ ఫర్ చేంజ్ పేరుతో మాదాపూర్‌లోని హెచ్ఐసీసీ వేదికైంది. మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ ముఖ్య అతిథులుగా విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రీమియర్ ఎనర్జీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో టాలీవుడ్ నటి లక్ష్మీ మంచు నిధుల సేకరణ చేపట్టే క్రమంలో ఆదివారం టీచ్ ఫర్ చేంజ్ 2025 పేరుతో ఫ్యాషన్ షో ని నిర్వహించారు. టీచ్ ఫర్ చేంజ్ వార్షిక నిధుల సేకరణ కార్యక్రమం ఫ్యాషన్ కార్యక్రమం విద్యా ద్వారా జీవితాలను మార్చడానికి కృషి చేసే ఉద్యమం అని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. నిధుల సేకరణ కార్యక్రమంలో షో స్టాపర్‌గా నూతన ఉత్సాహం తీసుకువచ్చిన రియా చక్రవర్తి, స్వాతి వెల్దండి ఆభరణంతో పాటు పరిశ్రమ భాగస్వాములందరూ అద్భుతమైన మద్దతును అందించడం సంతోషంగా ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు సెలబ్రిటీలు.. లక్ష్మీ మంచు, సైనా నెహ్వాల్, ఇషా రెబ్బ, హెబ్బా పటేల్, రాజశేఖర్, శివాత్మిక రాజశేఖర్, శాన్వి మేఘన, అవంతిక మిశ్రా, రాశి సింగ్, అనసూయ భరద్వాజ్, పాయల్ రాజ్‌పుత్‌తో పాటు ప్రియతమ్ ప్రియతం, మిస్ కాదు వర్మ, సౌరబ్ దింగ్రా, అరవింద్ కృష్ణ, నవదీప్ హాజరై ర్యాంప్ వాక్ చేసి సందర్శకులను అలరించారు.

# సందిగ్ధంలో ఎలివేటెడ్!

- ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్ట్ విషయంలో ప్రభుత్వానికి కొత్త చిక్కులు
- భూబదలాయింపుపై రక్షణశాఖ షరతులు
- ప్రాజెక్ట్ వెడల్పు తగ్గించాలంటున్న స్థానికులు
- నాలుగు నెలలుగా ముందుకు సాగని పనులు



ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట్ వరకు నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ నమూనా చిత్రం

సిటీబ్యూరో, ఏప్రిల్ 13(నమస్తే తెలంగాణ): నార్త్ సిటీ ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు భూములు ఇవ్వాలంటే తమ షరతులు అంగీకరించాల్సిందేనని రక్షణ శాఖ చెబుతోంది. జేబీఎస్ నుంచి శామీర్‌పేట్, ప్యారడైజ్ నుంచి డెయిరీ ఫాం మార్గాలలో దాదాపు 18 కిలోమీటర్ల పొడవైన ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును చేపట్టేందుకు హెచ్ఎండీఏ శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో రక్షణ శాఖ భూములతోపాటు, ప్రైవేటు ఆస్తుల సేకరణకు చర్యలు చేపట్టింది. భూసేకరణ బాధ్యతలను మేడ్చల్, హైదరాబాద్ జిల్లా యంత్రాంగానికి అప్పగించింది. అయితే ఇటీవల భూముల బదలాయింపునకు తీసుకోవాల్సిన చర్యలపై హెచ్ఎండీఏ, రక్షణ శాఖల మధ్య జరిగిన సమావేశంలో... రక్షణ శాఖ అధికారులు పలు షరతులను ప్రతిపాదించినట్లుగా తెలిసింది. వాటికి హెచ్ఎండీఏ ఆమోదిస్తే గానీ, భూముల బదలాయింపు ప్రక్రియను చేపట్టేది లేదని తెలిసింది. ఇందులో ప్రధానంగా రక్షణ శాఖ కోల్పోతున్న ఆస్తులకు సమానంగా భూములు ఇవ్వడంతోపాటు, కూల్చివేసే నిర్మాణాలను కూడా కట్టి ఇవ్వాల్సిందేనంటూ షరతులు పెట్టినట్లుగా వెల్లడైంది. ఈ క్రమంలో ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు కాంగ్రెస్ పార్టీకి తలనొప్పిగా మారింది. రక్షణ శాఖ సూత్రప్రాయంగా తొలుత భూములు ఇచ్చేందుకు అంగీకరించింది. కానీ ఆ తర్వాత భూముల బదలాయింపునకు పెడుతున్న కొర్రీలతో కొత్త సమస్యలు వస్తున్నాయి. ఇప్పటికే కోల్పోతున్న భూమికి పరిహారంగా ఒకే చోట అంతకు సమాన విలువైన భూమిని అందించాలనే నిబంధనతోనే ఇప్పటికీ భూసేకరణ ముందుకు సాగలేదు. తాజాగా ప్రాజెక్టు కోసం భూములు ఇచ్చేందుకు రక్షణశాఖ అధికారులు పెడుతున్న షరతులు ప్రాజెక్టు పురోగతిని మరింత సందిగ్ధంలో పడవేసినట్లు తెలుస్తోంది.

### రక్షణ శాఖ విధించిన షరతులు..!

భూముల బదలాయింపునకు రక్షణ శాఖ విధించిన షరతుల్లో ప్రధానంగా జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ మార్గంలో రక్షణ శాఖకు చెందిన రెండు భారీ రిజర్వాయర్లు, మరికొన్ని కట్టడాలు, భవంతులు కోల్పోతున్నట్లుగా తెలిసింది. వీటికి పరిహారంతోపాటు, అదే తరహాలో వేరేచోట వాటిని నిర్మించాలనే ప్రతిపాదన తెరమీదకు వచ్చినట్లుగా తెలిసింది. పరిహారంతోపాటు, తాజా ప్రతిపాదనలకు అంగీకరిస్తేనే ప్రాజెక్టు కోసం అవసరమైన 110 ఎకరాలకు పైగా భూమిని ఇవ్వాలనే రక్షణ శాఖ ప్రతిపాదనతో ఇప్పుడు హెచ్ఎండీఏ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

### వెడల్పు తగ్గించాలంటున్న స్థానికులు

ఇప్పటికే ప్రైవేట్ వ్యక్తుల నుంచి ఆస్తుల సేకరణ వ్యవహారం కోర్టుల్లో చిక్కుకుని ముందుకు సాగడం లేదు. ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేసి 4 నెలలు గడుస్తున్నా... 50శాతం కూడా ఆస్తుల సేకరణ పూర్తికాని పరిస్థితి ఉంది. ఇక ప్రాజెక్టు వెడల్పును 200 ఫీట్ల నుంచి 100–150 ఫీట్లకు తగ్గించాలని, మార్కెట్ రేటు ఆధారంగా పరిహారం చెల్లిస్తేనే భూములు ఇస్తామని ప్రైవేట్ వ్యక్తులు తేల్చి చెప్పడం ప్రభుత్వానికి కొత్త సమస్యగా మారింది.



స్టోర్ ప్రారంభోత్సవంలో వైష్ణవి చైతన్య

# వెడ్డింగ్ కలెక్షన్‌లకు కేరాఫ్‌గా విశిష్ట

- టాలీవుడ్ నటి వైష్ణవి చైతన్య
- కొత్తపేటలో విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్ 2వ స్టోర్ ప్రారంభం

ఆర్కే పురం , ఏప్రిల్ 13: కొత్తపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్స్ 2వ స్టోర్‌ను టాలీవుడ్ నటి వైష్ణవి చైతన్య ఆదివారం ప్రారంభించారు. నటిని చూసేందుకు అభిమానులు భారీగా తరలివచ్చారు. స్టోర్ ప్రారంభించిన అనంతరం వైష్ణవి చైతన్య మాట్లాడుతూ..స్టోర్‌లోని గోల్డ్ అండ్ డైమంజ్ జ్యూవెలరీని అద్భుతంగా డిజైన్ చేశారన్నారు. ఇక వెడ్డింగ్ కలెక్షన్‌కు విశిష్ట కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తుందన్నారు. తాను కూడా లైట్ వెయిట్ డైమండ్ జ్యూవెలరీ అంటే ఎంతో ఇష్టపడతానన్నారు. విశిష్ట స్టోర్‌లో విభిన్నంగా, సంప్రదాయ శైలిని ఆధునికతతో సమ్మిళితంగా చేసిన డిజైన్లు తనను ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. విశిష్ట సీఈఓ, డైరెక్టర్ సిందుజా, మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ.. "ప్రతి ఆభరణాన్ని అత్యున్నత నైపుణ్యం కలిగిన కారీగర్లు(సిబ్బంది) డిజైన్ చేస్తారని వివరించారు. తమ వద్ద ప్రతి డిజైన్ ఒక ప్రత్యేకతను కలిగి ఉంటుందన్నారు.